www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 ఆగస్టు 2024
5
వైఎస్ఆర్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మంత్రులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ఈనెల 15న నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పతాకావిష్కరణ కార్యక్రమాలకు కడప, అన్నమయ్య జిల్లాలకు రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కర్నూలు చెందిన మైనార్టీ శాఖ మంత్రి నస్యం మహ్మద్ ఫరూఖ్, అన్నమయ్య జిల్లాకు రాష్ట్ర రవాణా, యువజన,క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నియమించింది.

క్విట్ 'కార్పొరేట్స్' ఇండియా

నిరసన చేపట్టిన వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలోని అంబేద్కర్ సర్కిల్లో శుక్రవారం వామపక్ష కార్మిక రైతు సంఘాల నాయకులు క్విట్ కార్పొరేట్స్ ఇండియా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు నాగ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి, సుబ్బారెడ్డి, అన్వేష్ మాట్లాడారు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా డే సందర్భంగా నిరసన చేపట్టామని తెలిపారు. 1942, ఆగస్టు 9న ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశం విడిచి వెళ్లి పోవాలంటే క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టారని చెప్పారు. ఆ స్ఫూర్తితో రైతుల వ్యవసాయాన్ని, కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ కార్పొరేట్స్ క్విట్ ఇండియా నినాదంతో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు పిలుపునిచ్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. దేశంలో విత్తన వ్యాపారం అంతా మోన్ శాంటో, కార్గిల్ లాంటి బహుళ జాతి కంపెనీ చేతుల్లో ఉందని చెప్పారు. రైతులను రక్షించే విత్తన చట్టం లేదన్నారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని విమర్శించారు. వసూలు చేసిన ప్రీమియంలో 80 శాతం లాభాలు పేరుతో కంపెనీలు దోచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలపై విధించే

నిరసన తెలియజేస్తున్న వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు

పన్నును 30శాతం నుంచి 20 శాతం తగ్గించారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయ పరికరాలపై 18 శాతం జిఎస్‌టి వసూలు చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించడం దారుణమన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసు కురావాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఆహార సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధులు కోత పెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు ఇవ్వడం ఇదేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పన్నులు భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలని కోరారు. సమావేశంలో రైతు కార్మిక సంఘాల జిల్లా నాయకులు బాదుల్లా, వెంకట సుబ్బయ్య, చంద్రారెడ్డి, మద్దిలేటి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు సుంకర రవి, సుబ్బరాయుడు, మల్లికార్జున, మహిళా సంఘం నాయకులు భాగ్యమ్మ, రైతు సంఘం జిల్లా నాయకులు గోపాలకృష్ణయ్య, బాలచంద్రయ్య, రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, యానాదయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పట్టణంలోని అంబద్కేద్ భవనం ముందు కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ కార్మిక రైతు సంఘాల నాయకులు ఎన్‌న్.భైరవ ప్రసాద్, బి .లక్ష్మీదేవి, బసిరెడ్డి లక్ష్మీదేవి,అంగన్వాడీ నాయకులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఓబులాపురం విజయమ్మ, మేరీ , దస్తగిరిమ్మ, జ్యోతిమ్మ, లావణ్య పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి లేఖ అందజేస్తున్న ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి

ప్రొద్దుటూరు-బెంగళూరుకు
కొత్త రైలును ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రొద్దుటూరు నుంచి బెంగళూరుకు కొత్త రైలు ఏర్పాటు చేయాలని కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్. అవినాష్ రెడ్డి ఢిల్లీలో శుక్రవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి కోరారు. రాయలసీమలోని అన్ని జిల్లాలకు వై.ఎస్.ఆర్ జిల్లా కేంద్రబిందువు వంటిదని, కానీ దురదృష్టవశాత్తు ప్రస్తుతం కడప జిల్లా నుంచి బెంగళూరుకు ఇప్పటివరకు ఎలాంటి రైల్వే సర్వీసులు లేవని , దీనివల్ల ఐటి ఉద్యోగులు, అనారోగ్య సమస్యలతోను, ఇతర పనులతో కడప జిల్లా నుంచి బెంగళూరు వెళ్లే ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న కడప -బెంగళూరు రైల్వే లైన్ ఇప్పటివరకు 260 కిలోమీటర్స్‌కు గాను 28 కిలోమీటర్ల పనులు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. ప్రొద్దటూరు నుంచి బెంగళూరుకు వయా ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం తాడిపత్రి, గుత్తి జంక్షన్ మార్గం ద్వారా కొత్త రైల్వే సర్వీస్‌ను తక్షణం ప్రారంభించాలని కోరారు. లేదా ప్రస్తుతం నంద్యాల జంక్షన్ నుంచి మూడు రైళ్లు బెంగళూరుకు వెళ్తున్నాయి. వాటిలో ట్రైన్ నంబరు 17211 ను నంద్యాల జంక్షన్ నుంచి బనగానపల్లె, కోయిలకుంట్ల , జమ్మలమడుగు, ప్రొద్దటూరు, ఎర్రగుంట్ల, , ముద్దనూరు, కొండాపురం, తాడిపత్రి, గుత్తి జంక్షన్ ద్వారా మళ్లించి బెంగళూరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మొక్కల పెంపకం వ్యక్తిగత బాధ్యత

ప్రజాశక్తి - కడప అర్బన్ : మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పాటు వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జెసి అదితి సింగ్, డిఎఫ్ఒ సందీప్‌రెడ్డితో కలిసి జిల్లాలో వనమహోత్సవం నిర్వహణా కార్యాచరణపై కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా తమవంతు బాధ్యతగా విజయవంతం చేయాలని కోరారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణం పరంగా గతంలో జరిగిన నష్టాలను పూరించే దిశగా ఈ తరం యువత సమాజాన్ని పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. మొక్కలను వ్యక్తిగతంగా అభిమానిస్తూ మన ఇంటి పరిసరాల్లో, మనకు చేరువలో పచ్చదనాన్ని పెంపొందించేలా ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఈ సందర్భంగా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని జిల్లా కలెక్టర్ నిర్ధేశించి వారికి బాధ్యతను అప్పగించారు. కార్యక్రమంలో సామాజిక అటవీ విభాగం డిఎఫ్ఒ నాగార్జున రెడ్డి, డ్వామా పీడీ జోయల్ విజయ్ కుమార్, డిఇఒ అనురాధ, కెఎంసి అదనపు కమిషనర్ రాకేష్ బాబు, అనుబంధ శాఖల అధికారులు, ఇంటాక్, రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ మొదలైన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎద్దుల రాహుల్ వీరపోగు రవి

కడప నగరంలో ఈనెల 8న యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. 17 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎద్దు రాహుల్, జిల్లా కార్యదర్శిగా వీరపోగు రవిని ఎన్నుకున్నారు. విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క భారత విద్యార్థి సమావేశం ప్రారంభం ముందు వయనాడులో జరిగిన పరిణామానికి సంతాపం తెలిపి సమావేశాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ కుమార్ హాజరయ్యారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ గురించి గత ప్రభుత్వంలో విద్యారంగంలో చేసిన విద్యార్థి వ్యతిరేక మార్పుల గురించి ప్రసంగించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో, సంక్షేమ హాస్టల్లో నిర్మాణం చేపట్టాలని తెలిపారు. నియోజకవర్గ కేంద్రాలలో, ఐటిఐ కళాశాలలో డిగ్రీ, ఇంటర్ కళాశాల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని చెప్పారు. వివిధ సమస్యల మీద తీర్మానాలు సమావేశంలో ఆమోదించుకుని భవిష్యత్తు ఉద్యమానికి దిశానిర్దేశం చేసుకున్నారు. ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా ఉపాధ్య క్షులుగా సునీల్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా అజయ్ కుమార్, మనోజ్, 17 మందితో కూడిన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. విద్యారంగ సమస్యలపై కార్యాచరణ రూపొందించుకుని ఉద్యమి స్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : స్మార్ట్ సాయి ఆర్ఆర్ హోమ్స్ ఆక్రమించిన సర్వేనెంబర్ 247/2లో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. శుక్రవారం ఆర్‌డిఒ వెంకటపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి. నారాయణ మాట్లాడుతూ వంక పరంబోకు 1.50 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అపార్ట్మెంట్, రోడ్డు నిర్మాణం సాగించారని తెలిపారు. ఇక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని గతంలో కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి 50 అడుగుల రోడ్డు, అపార్ట్మెంట్ నిర్మిస్తూ ఉంటే చూస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు, అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు కార్పొరేషన్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్ని ంచారు. ఇప్పటికే నగరంలో భూ కబ్జాదారులు వంకలు, వాగులు, కుంటలు, చెరువులు ఆక్రమించడంతో వర్షపు నీరు పోయేందుకు మార్గము లేక రోడ్లపైనే మోకాళ్ళ లోతు నిలిచిపోతున్నాయని తెలిపారు. అనుమతించిన కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అపార్ట్‌మెంట్ నిర్మాణం రద్దు చేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గుర్రప్ప, దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిషోర్ బాబు, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి ఆర్ ప్రసాద్, జర్నలిస్టు అంజి పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయంగా ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, వై జంక్షన్ ప్రాంతాలలోని షాపులు, ప్రజలు, ఫుట్ పాత్ వ్యాపారులు, యువత నుంచి నిధులు సేకరించారు. ఇరిగేషన్ కార్యాలయంలో ఉద్యోగుల నుంచి విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలతోపాటు సిబ్బంది, విలేకరులు ఇచ్చిన రూ.16,583 మొత్తాన్ని వయనాడు వరద బాధితుల సహాయార్థం పంపిస్తామని ప్రజాశక్తి జిల్లా మేనేజర్ సిద్దయ్య తెలిపారు. వరద పునరావాస చర్యల్లో కేరళ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. విరాళాల సేకరణ కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది, విలేకరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణలో ప్రజాశక్తి సిబ్బంది, విలేకరులు

ఆదివాసీలు గత కాలపు ఆనవాళ్లు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆధునిక సమాజ గత కాలపు ఆనవాళ్లుగా ఆదివాసులు నిలిచారని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ హాల్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు శాసన సభ్యులు సి. ఆదినారాయణ రెడ్డి, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, డిస్ట్రిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఇన్‌ఛార్జి అధికారి సరస్వతి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ సురేష్ రెడ్డి, ఎల్‌డిఎం జనార్ధనరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంతో సంబంధం లేకుండా ఇప్పటికీ చాలా తెగలు సమిష్టి జీవన పద్ధతులు, సహజీవనం సాగిస్తూ పారదర్శకతకు నిలువెత్తు సాక్షులుగా నిలుస్తున్నారన్నారు. 2004 నుంచి మన దేశంతో పాటు దాదాపు 93 దేశాలు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం నిర్వహించుకుంటున్నాయని తెలిపారు. అడవినే నమ్ముకుని జీవించే నిష్కల్మశ హృదయులైన ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు విజయవంతంగా వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వారి జీవితాల్లో గుణాత్మక మార్పుకు దోహదం కావాలన్నారు. చరిత్ర పరంగా గిరిజనులు సున్నితమైన స్వభావం కలిగిన వారన్నారు. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం కొన్ని కోట్లు వెచ్చించడం జరుగుతుందనే గిరిజనులు వాటిని తెలుసుకొని ప్రయోజనం పొందాలన్నారు. విజ్ఞానం కోసం తప్పక చదవాలన్నారు. షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించడానికి షెడ్యూల్ ప్రాంతాల్లో ఉన్న గిరిజన విద్యార్థులకు గురుకుల తరహా విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న గిరిజన హాస్టల్ గురుకుల పాఠశాలలుగా మార్చిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును వినియోగించుకుని బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి మీ కుటుంబాలకు ఆసారాగా నిలవాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆహార భద్రత పౌష్టికారాన్ని పెంపొందించడం, సుస్థిరమైన వ్యవసాయం ఆరోగ్యవంతమైన జీవితాన్ని షెడ్యూల్ తెగల వారందరికీ సామాజిక సాధికారత సాధించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకొని పనిచేయాలని అన్నారు. గిరిజన వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు, వసతులను సమకూరుస్తారన్నారు. తొలుత భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, ఏకలవ్యుడు, సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపతాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చిన్నారులు చేసిన గిరిజన నృత్యాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రెసిడెంట్ ఎస్. నాగన్న, ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం డాక్టర్ శివానాయక్, యనాది సంక్షేమ సంఘం కె. అయ్యావారయ్య, ఎరుకాల హక్కుల పోరాట సమితి పి. పుల్లయ్య, ఇతర గిరిజన సాంగ్స్ నాయకులు ఎన్. సురేంద్ర, ఈ. ప్రసాద్, పి. చసంద్రశేఖర్, ఎస్. శివశంకర్, ఎమ్. శివార్జున,జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సంఘ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

ఆంతర్యం బయట పెట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

రెజ్లర్ వినేష్ ఫొగట్ అనర్హత వేటుపై ఆంతర్యం బయట పెట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్యారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్స్ ఉత్సవాల్లో రెజ్లర్ వినేష్ పోగాట్ ఫైనల్‌కు చేరుకుందని అన్నారు. బుధవారం రోజు రాత్రి ఫైనల్ ఆడాల్సిన వినేష్ పోగట్‌పై దేశ ప్రజల గుండె పగిలేలా అనర్హత వేటు ప్రకటించిందన్నారు. అనర్హత వేటుపై సరైన సమాధానాలు చెప్పకుండా కాకమ్మ కథలు చెబుతున్నారని విమర్శించారు. ఏదైనా క్రీడలో పాల్గొనక ముందే అన్ని విధానాలుగా విచారణ చేసిన తర్వాతే ప్రవేశం కల్పిస్తారని అన్నారు. అలా విచారణ చేసి క్రీడల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించి ఫైనల్స్‌లో ఆడాల్సిన సమయంలో ఉండాల్సిన బరువు కంటే ఎక్కువ ఉన్నారనే సాకుతో అనర్హత వేటు వేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలియజేశారు. గత సంవత్సరం రెజ్లర్ ఫెడరేషన్ అధ్యక్షులు బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని గమనంలో పెట్టుకొని రాజకీయ కక్ష సాధింపు సాధించారా అని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వానికి వారు నియమించిన శాఖలకు వ్యతిరేకంగా ఎవరు పోరాడినా వారికి ఇదే గతి పడుతుందని చెప్పడానికి చేసిన పనేనా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీకి నిజంగా దేశ క్రీడాకారులపై ప్రేమ ఉంటే అంతర్జాతీయ రెజ్లర్ల కమిటీ ఒలంపిక్స్ కమిటీ తీసుకున్న నిర్ణయంపై తీవ్రంగా ఖండించాలని డిమాండ్ చేశారు. భారత క్రీడాకారులపై రాజకీయ కక్ష సాధింపులు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దేశ ప్రజలందరూ వినేష్ పోగట్‌కు అండగా నిలబడాలని మీకు మేమున్నామని భరోసా ఇవ్వాల్సిన సందర్భమని దేశ ప్రజలందరూ స్పందించాలని పిలుపునిచ్చారు. అవినీతి అక్రమాల క్రీడా శాఖపై సమగ్ర విచారణ చేపట్టాలని రెజ్లర్ల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారులపై దర్యాప్తు చేపట్టాలని వినేష్ పోగాట్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు యు ఆంజనేయులు సహాయ కార్యదర్శి ఇమ్మానియేలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

వక్ఫ్ ఆస్తుల దోపిడీకి మోడీ కుట్ర : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

దేశంలో వక్ఫ్ ఆస్తుల దోపిడీకి ప్రధాని మోడీ భారీ కుట్రపన్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం లోక్‌సభలో వక్ఫ్ చట్టం -1995కు పూర్తి స్థాయిలో కేంద్రంలోని ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం సవరణలతో ఈ బిల్లును ప్రతిపా దించిందన్నారు. ఇప్పటివరకు దేశంలోని 8,72,324 వక్ఫ్ ఆస్తులకు రక్షణగా ఉన్న చట్టాన్ని పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేస్తూ సవరణలు చేశారని విమర్శించారు. మైనార్టీల మత స్వేచ్ఛ, వారి హక్కులను కాలరాస్తూ ప్రధాని మోడీ ప్రభుత్వం భారీ కుట్ర చేస్తోందన్నారు. బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధాని షేక్ హసీనాకు పట్టిన గతే నరేంద్ర మోడీకు కూడా పడుతుందని హెచ్చరించారు. ఆస్తుల దురాక్రమణపై ఎలాంటి చర్యలు చట్టాలు చేయకపోగా ఉన్న చట్టాన్ని కూడా లేకుండా చేసేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం ఏకపక్ష చర్యలకు ఉపక్రమించడంపై ఆందోళన చేపడతామని తెలిపారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఎం. రహమతుల్లా ఖాన్, జిల్లా ఒబిసి మాజీ అధ్యక్షులు చిన్న కులాయప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి-కాశినాయన :మండలంలోని గర్భిణులు వైద్యాధికారుల సూచనల మేరకు మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని మండల ఆరోగ్యశాఖ అధికారి ప్రశాంతి తెలిపారు చ శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. హై రిస్క్ గర్భిణులు మెలకువలు పాటించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టి కాహారం తినాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్డు వంటి భోజ నాలు తప్పనిసరిగా రోజూ తినాలన్నారు. అనంతరం గర్భిణులు భోజనాలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నిర్మల, పిహెచ్ఎన్ శారద, సూపర్‌వైజర్లు బాలయ్య, హుస్సేనమ్మ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప విద్యార్థి ఎం. అశోక్ ఢిల్లీ ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపిక అయ్యాడు. ఈ విద్యార్థి ఈనెల 11న బయలుదేరి న్యూ ఢిల్లీలో జరిగే వేడుకలకు కడప జిల్లా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హాజరుకానున్నారు. ఈ వేడుకలకు కేంద్ర యువజన సర్వీసులు క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి విద్యార్థి ఆహ్వానం అందుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. శివరామకృష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ లీలవర్ధిని, ఇతర అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

అశోక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు
- బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సిపిఎం, సిపిఐ నివాళి

ప్రజాశక్తి-కడప అర్బన్

పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అభివృద్ధికి, అభ్యుదయ ఉద్యమాలకు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి. చంద్ర శేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని సిపిఎం కార్యాలయంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య దేశానికి, బెంగాల్ రాష్ట్రానికి ఎన్నో సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామమోహన్, దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, అన్వేష్, చంద్రారెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, గోపాల కృష్ణయ్య, రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య పార్థీవదేహానికి శుక్రవారం కలకత్తాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ నివాళులు అర్పించారు. 2000 సంవత్సరం నుంచి2011 వరకు వెస్ట్ బెంగాల్ సీఎంగా బుద్ధదేవ్ భట్టాచార్య పనిచేశారని గుర్తు చేశారు. వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో అనేక మంచి పరిణామాలు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.

జమ్మలమడుగు రూరల్ : మాజీ సిఎం బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి జమ్మలమడుగు సిపిఎం పట్టణ కార్యదర్శి జి. ఏసుదాసు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 నుంచి 2011 వరకు పశ్చిమ బెంగాల్ సిఎంగా బుద్ధదేవ్ భట్టాచార్య పనిచేశారన్నారు. ఆ రాష్ట్రంలో అనేక మంచి పరిణామాలు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఎంతోమందికి ఆదర్శమని తెలిపారు. ేకార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు విజయ , వినయ్ కుమార్ , రవి, రావ్ రాకెట్ మరియు సిపిఎం నాయకులు ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

యువతకు భరోసా ఇవ్వడమే కర్తవ్యం

ప్రజాశక్తి - కడప : యువతకు భరోసా ఇవ్వడమే కాంగ్రెస్ కర్తవ్యం అని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ అన్నారు.ఇండియన్ యూత్ కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ జెండా ఎగరవేసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లోకికవాదం, స్వేచ్ఛ, నాణ్యత, సమానత్వం వంటి విలువ లతో కూడిన బాధ్యతాయుతమైన పౌరులను నాయకులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావించిందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎం.విజయ్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు సూర్యవంశీ, మహబూబ్ బాషా, పాల్గొన్నారు.

కంటి సమస్యల్లేనప్పుడే చదువులో రాణిస్తారు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కంటి సమస్యల్లేనప్పుడే విద్యార్థులు చదువులో రాణిస్తారని ఎంఇఒ చంద్రశేఖరరావు అన్నారు. పట్టణంలోని రవణప్ప సత్రం ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (అంకాలమ్మపేట), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి చూపుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ముఖ్యఅతిథిగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చదువుపై దృష్టి సారించాలంటే కంటి చూపు ప్రధాన మన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంఘం నేత్రాధికారులు సుధాకర్‌రెడ్డి, రిమ్స్ నేత్రాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పౌష్టికాహారం తీసుకుంటే దృష్టి లోపాలను అధిగమించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఎఎన్ఎం సుందరమ్మ, చంద్రకళ, ఆశా కార్యకర్తలు బాల రమిజా, రామాంజులమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సల్మాన్‌రాజ్, ఈఓపీఆర్డి పద్మనాభరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఎంపీడీవో సభా భవనంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీలో పారిశుధ్యం, నిధులు వినియోగం ఇతర అంశాలను మాస్టర్ ట్రైనర్స్ వివరిస్తారన్నారు. మండలంలోని సర్పంచులు, సెక్రటరీలు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

చాపాడు : మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లకు ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ రహంతుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సర్పంచులతోపాటు పంచాయతీ కార్యదర్శులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎండిడిఒ కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు.

ఐటిఐలో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీ కందుల ఓబుల్‌రెడ్డి చారిటీస్ ఐటిఐలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు వివిధ కోర్సులలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మూడవ విడతలో మిగులు సీట్ల భర్తీకి వేంపల్లె ఐటిఐలో ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్ కోర్సులు ఉన్నాయన్నారు. ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు కళాశాలలో తనను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

ఊత కర్రలకు రాయితీ

ప్రజాశక్తి - ముద్దనూరు

కర్బూజ, దోస, కళింగర, బీర, కాకర, టమాటో పంటలకు ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని మండల ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒక హెక్టర్‌కు రూ.16వేలు చొప్పున గరిష్టంగా 2 హెక్టార్లకు రూ.32వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. టమాటో, బీర, కాకర పంటలకు ఊత కర్రలు ఏర్పాటు చేసుకుంటే ఒక హెక్టర్‌కు రూ.20వేలు ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. అర్హులైన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఫలితాల్లో రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల విజయభేరి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి(సర్కిల్)

మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగివేమన యూనివర్సిటీ నిర్వహించిన 2,4వ సెమిస్టర్ డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాల్లో చక్కటి ప్రతిభను కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక జీపీఏ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాల రెండవ సంవత్సరం, నాలుగవ సెమిస్టర్ బీఎస్సీ హానర్స్ బయోటెక్నాలజీలో ఎస్ బుష్రా ఫిర్దోస్ 9.69, కేఎస్ రోషన్ 9.51, ఎమ్ మైథిలీ 9.51, జీఎస్ సఫాన 9.5 సాధించారని తెలిపారు. బయోటెక్నాలజీ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో ఎస్ సాజియా 9.75, పీ సుస్మిత 9.5, ఎం బిల్ కిస్ జ 9.25, షాహిన్ 9.25 సాధించారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ నాలుగవ సెమిస్టర్‌లో కే యశస్విని 8.01, ఎం పూజిత 7.84, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 2 వసెమిస్టర్ పలితాలలో ఏ నాగ సుమిత్ర 9.5, ఎస్ అనిషా అంజుమ్ 9.25, వై హరిత 9.25, ఎం గౌస్మిన్ 9.0 సాధించారు. నాల్గవ సెమిస్టర్ బీకాం డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో వైస్ సుగుణ కుమారి 8.98, ఎస్ యాస్మిన్ 8.95, ఎస్ రుబీనా 8.72 సాధించారు. రెండవ సెమిస్టర్ బీకాం డిగ్రీ హానర్స్ ఫలితాలలో ఎం జబీన్ 9.5, బి షహీన్ 9.17, ఎస్ రిజ్వానా భాను 9.17, కే హేమలత, కే మహమ్మద్, ఎస్ గౌసియా, ఎస్ యశస్విని 8.92 సాధించారు. మంచి ప్రతిభను కనపరిచిన విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపల్, కరస్పాండెంట్ తరుణేంద్ర శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

యూనివర్సిటీ టాపర్స్‌గా మైదుకూరు విద్యార్థులు

మైదుకూరు : యోగి వేమన విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ టాపర్స్‌గా రావడం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల చదువుతున్న వరుసగా గత మూడు, నాలుగు సెమిస్టర్ల నుండి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచి కళాశాల కీర్తిని పెంపొందించారని తెలిపారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. అందుకు కృషి చేసిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కే.సుభాన్ సాహెబ్, సీనియర్ అధ్యాపకులు రాధారామ్, సుబ్బరాయుడు, రామేశ్వర్‌రెడ్డి, అయ్యవారురెడ్డి, నరసింహారావు, నవనీశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చెన్న రాయుడు, శ్రీనివాసులు, శివకేశవ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టనున్న మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని వారు కోరారు.

వేముల : మండలంలోని మబ్బుచింతలపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందు వల్ల ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. తుమ్మలపల్లె ఫీడర్‌లోని గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు విద్యుత్ గమనించాలని కోరారు.

చాపాడు : మండల పరిధిలోని ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతులు చేపడుతున్నామని ఆ శాఖ ఏఈ సాయి ప్రసాద్ తెలిపారు. ఈ కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలన్నారు.

పెద్దముడియం : మండలంలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి రామకృష్ణ తెలిపారు. పునరుద్ధరణ అనంతరం యధావిధిగా విద్యుత్ సరఫరా కొనసాగుతుందని పేర్కొన్నారు.

వంకలను తలపిస్తున్న ప్రధాన రోడ్లు

రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణంలోని పలు ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. వర్షం వస్తే ఆ రోడ్లు వంకలను తలపిస్తున్నాయి. రోడ్లల్లో ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి బస్టాండ్‌కు అతి సమీపంలోని తాడిపత్రి-కడప ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు నీరంతా మడుగులా చేరింది. పట్టణంలోని పలు రహదారుల్లో ఇదే దుస్థితి ఎదురవుతోంది. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా నీరు నిలు స్తుండడంతో రోడ్డు దెబ్బతింటోంది. రోడ్డు పక్కన షాపులు నిర్వహిస్తూ జీవ నం సాగిస్తున్న వ్యా పారులు వర్షపు నీటి కారణంగా అసౌకర్యాన్ని గువుతున్నారు. ఒకసారి వర్షం కురిస్తే వారం పాటు నీరు నిల్వ ఉంటోందని, దీంతో తమకు వ్యాపారాలు జరగడంలేదని షాపుల యజమానులు వాపో తున్నారు. రోడ్డు పక్కన దాదాపు 20 మంది వరకు షాపులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి వర్షాకాలం ఇదే సమస్య. కాలువలు లేకపో వడంతో నీరు పోవడంలేదు. అక్కడే మురుగుగా తయారై దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను గత ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకున్న నాధుడులేడు. సమస్యలను పలు మార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. డ్రయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కరిష్మా సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త హీనత ఉన్న గర్భిణులు గుడ్లు, పాలు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు సురక్షితమన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ జాన్సన్ గర్భిణులకు బిపి, షుగర్, వివిధ రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ శోభాకుమారి, ఫార్మసిస్ట్ జగదీష్, హెల్త్ అసిస్టెంట్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు..

ఆర్‌సిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం

కొండాపురం : అన్నదానం మహాదానమని కొండాపురం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సుజాత, ఎల్‌డిసి నారాయణరెడ్డి తెలిపారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి నెల పరీక్షలు నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆర్‌సిడిఎస్ 8నెలలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అన్నదానం చేశారు. కార్యక్రమానికి హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతానగరానికి చెందిన పింగిలి బాలకృష్ణారెడ్డి ఆర్థికసాయం అందించారని సొసైటీ జాతీయ కన్వీనర్ ఒంటెద్దు రామ లింగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి ఆలమూరి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా మీడియా అధ్యక్షుడు వెల్లాలి లింగేశ్వరరెడ్డి, మండల నాయకులు హనుమంతరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం వడ్డిస్తున్న ఆర్‌సిడిఎస్ ప్రతినిధులు

క్విట్ ఇండియా ఉద్యమం చారిత్రిక ఘట్టం

ప్రజాశక్తి - వేంపల్లె

భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమం ఒక చారిత్రిక ఘట్టమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి 82వ క్విట్ ఇండియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం వదలి వెళ్లండని 1942 ఆగస్టు 8న మహాత్ముడు ఆంగ్లేయులకు అల్టిమేటం ఇచ్చారన్నారు. గాంధీజీ పిలుపు మేరకు మరుసటి రోజునా ఆగస్టు 9న క్విట్ ఇండియా అంటూ లక్షలాది మంది కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు రోడ్లపైకి వచ్చారన్నారు. అదే క్విట్ ఇండియా ఉద్యమంగా మారిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మరో స్వాతంత్ర్య పోరాటానికి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు సిద్ధం కావాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు.

మునికోటి అమరజీవి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కోసం ప్రాణత్యాగం చేసిన తిరుపతికి చెందిన మునికోటి అమరజీవి అని తులసిరెడ్డి కొనియాడారు. ప్రత్యేకహోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి కాంగ్రెస్ కమిటీ రఘువీరారెడ్డి నేతృత్వంలో 2015 ఆగస్టు 8న తిరుపతిలో పోరుబాట పేరుతో నిరసన సభ నిర్వహించారన్నారు. ఆ సభలో ఉన్నట్టుండి తిరుపతికి చెందిన రామ మునికోటి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుని మృతి చెందారన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమా నాగరాజా, వేమయ్య, రవి, బద్రి, మదార్, వెంకటేష్, మాష్ ,రాజు పాల్గొన్నారు.

ప్రతి పంటను నమోదు చేయించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో సాగు చేసిన ప్రతి పంటను నమోదు (ఈ క్రాప్) చేయించాలని తహశీల్దార్ గుర్రప్ప సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ చేయించాలన్నారు. ముఖ్యంగా భూములు రీ సర్వే జరిగిన గ్రామాలలో కొంతమంది రైతులకు సంబంధించి గతానికి ప్రస్తుతానికి భూములు విస్తీర్ణంలో వ్యత్యాసం ఉందన్నారు. వాటిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేయాలన్నారు. పంట నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలోని సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయంతో పంటల నమోదు చేయించాలన్నారు. ఇన్‌ఛార్జి వ్యవసాయ శాఖ అధికారి రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదులో రెవెన్యూ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేలం పాట దక్కించుకున్న భూమిరెడ్డి రామాంజనేయరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు పురపాలిక సంఘానికి చెందిన మున్సిపల్ గ్రౌండ్‌లోని తాత్కాలిక కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను శుక్రవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేలం పాటలో సర్కారువారి పాట రూ.90లక్షలతో ప్రతిపాదించారు. ఈ బహిరంగ వేలంలో ఐదు మంది పాటదారులు పాల్గొన్నారు. వీరిలో రామాంజనేయరెడ్డి రూ.90లక్షల 20వేలకు వేలంపాట దక్కించుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 31వరకు కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్ రుసుములు వసూలు చేసుకునే అవకాశాన్ని పొందారు. ఈ బహిరంగ వేలంలో కమిషనర్ రఘునాధరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటుపడదామని డిఎస్‌పి హుస్సేన్ పీరా పిలుపు నిచ్చారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ముద్రించిన మాదకద్రవ్యాల నిర్మూలనపై సే నో టు డ్రగ్స్ పేరుతో ముద్రించిన పోస్టర్స్‌ను తన కార్యాలయంలో శుక్రవారం డిఎస్‌పి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు, మాదకద్రవ్యాల వంటి వాటి జోలికి వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపిందన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ సంఘానికి, నాయ కత్వానికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ యువతను డ్రగ్స్, మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాల వైపు నుండి మంచి సన్మార్గం వైపు నడవడం కోసం యువజన సంఘం అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహి స్తోందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు వీరనాల శివ నారాయణ, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, పట్టణ ఉపా ధ్యక్షులు సుబహాన్, పట్టణ కమిటీ సభ్యులు ఇస్మాక్ పుష్పరాజ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి, డివైఎఫ్ఐ నాయకులు

అందుబాటులో ఉండే సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్ రవాణా శాఖ అందుబాటులో ఉండే సిబ్బందిని నియమించాలని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ సూచించారు. స్థానిక విఆర్‌ఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ దశాబ్దాలు చరిత్ర కలిగిన విఆర్‌ఎల్ లాజిస్టిక్స్ రవాణా రంగంలో పేరుగాంచిన సంస్థ అన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కస్టమర్లకు కన్నీళ్లు పెట్టిస్తున్నారన్నారు. విఆర్ ఎల్ ట్రాన్స్‌పోర్ట్ సుదూర ప్రాంతాలకు మంచి సర్వీసు ఇస్తుందని కస్టమర్లు నమ్మి నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల నుండి పార్సల్ పెడుతున్నారని, తీరా ఇక్కడికి వచ్చి చూస్తే షెట్టర్లు మూసి ఉండడంతో కస్టమర్లు వెనుదిరుగుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిని వెంటనే తొలగించాలని ఆయన సంబంధిత యజమాన్యాన్ని కోరారు. అందరికీ అందుబాటులో ఉండే సిబ్బందిని నియమించాలని విజయ్ కోరారు.

ఎస్‌సి, ఎస్‌టి భూముల ఆక్రమణను అడ్డుకోండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్‌సి, ఎస్‌టిల భూముల ఆక్రమణను అడ్డుకోండని ఎస్‌సి, ఎస్‌టి దళిత వేదిక జిల్లా ప్రెసిడెంట్, కో-ఆర్డినేటర్ కన్నెలూరు లక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక డీయస్పీ కార్యాలయంలో నూతన డిఎస్పి హుస్సేన్ పీరాకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏపీ ఎస్‌సి, ఎస్‌టి దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షులు వంగిపురం రెడ్డన్న ఆదేశాల మేరకు డీఎస్పీని కలిశామన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ దళితులపై జరుగుతున్న అక్రమ దాడులను, దళితుల భూములను అగ్రవర్ణాల వారు కబ్జా చేయడం జరుగుతుందన్నారు. వీటిపై విచారణ చేపట్టి సత్వరం అన్యాయానికి గురైన దళితుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిఎస్పిని కోరామన్నారు. కార్యక్రమంలో కన్నెలూరు మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల అలసత్వం వహించొద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థుల పట్ల అలసత్వం వహించవద్దని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గూడెంచెరువు, పెద్దపసుపుల గ్రామంలోని కెజిబివి పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరుపట్టీని, మెనూ రికార్డులను పరిశీలించారు. అనంతరం వంటశాలలను, హాస్టల్ గదులను, బాత్రూమ్‌లను, తరగతి గదులను తనిఖీ చేశారు. తరగతి గదులలో విద్యార్థుల సామర్థ్యాన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారు చేసేటప్పుడు శుభ్రంగా ఉంచుకొని వంట వండాలన్నారు. వంటలపై దోమలు, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు కూడా తల్లిదండ్రులను వదిలి దూరంగా ఉంటూ కాలక్షేపం చేయకుండా బాగా చదువుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

పులివెందుల రూరల్: పులివెందుల మున్సిపల్ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు వెల్లాల సీతారామ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా మూడవ రోజు శుక్రవారం పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం గ్రామస్థులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్లచే బండలాగుడు పోటీలను ప్రజలు ఉత్సాహంగా చూశారు. ఈ పోటీలను వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి, రెండవ బహుమతులను చౌటి పల్లికి చెందిన మా చంద్ర ఓబుల్‌రెడ్డికి చెందిన ఎడ్లు గెలుచుకున్నాయి. మూడవ బహు మతిని గుంప్రమాన్ దిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి దక్కించుకున్నాయి. బాపట్ల వేటపాలెం చెందిన ఆర్‌కే బుల్స్ నాలుగవ బహుమతి, రామ తీర్థంకి చెందిన నాగరాజు ఐదవ బహుమతి, కె రామాంజనేయులు ఎడ్లు ఆరవ బహుమతిని, తోపదుర్తికి చెందిన కె చెన్నెప్ప ఎడ్లు ఏడవ బహుమతిని, మేది మక్కపల్లికి, పిఆర్‌పల్లి చెందిన పవన్‌కుమార్ రెడ్డి, శ్రీరాములు యాదవ్‌లకు చెందిన జంట్ల ఎడ్లు ఎనిమిదవ బహుమతిని, మూలి రామంజనీయులుకు చెందిన ఎడ్లు తొమ్మిదవ బహుమతులను గెలుపొందాయి. ఎడ్ల యజ మానులకు బహుమతులు అందజేశారు. దేవస్థానం తరుపున రూ.15వేలు విలువ చేసే అమ్మవారి వెండి బొమ్మను అందించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

పులివెందుల రూరల్ : పులివెందుల మహేష్ పుట్టినరోజు సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు బెస్తవారిపల్లె సమీపంలోని వైయస్సార్ సర్వజన ఆసుపత్రిలో శుక్రవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హీరో మహేష్ మాట్లాడుతూ తలసేమియా బారిన పడిన పిల్లల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. తన పిలుపుమేరకు అభిమానులు రక్తదానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో లోకల్ రౌడీ డైరెక్టర్ సలీం మాలిక్, ఉగ్రుడు డైరెక్టర్ కెవిఆర్, థాంక్యూ రిమైండర్ డైరెక్టర్ జగట రమేష్, పులివెందులకు చెందిన ప్రముఖ యూట్యూబర్లు పఠాన్, రాఘవేంద్ర, హీరో మహేష్ తమ్ముడు రాజు, రక్తదానం శిబిరం సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE Ist Addl DISTRICT JUDGE, KADAPA
M.V.O.P.No. 533/22

Battala Rajeswari. ...Petitioner

Vs

M.Vivekananda Reddy, S/o Manohar Reddy, Major, Hindu, Farmer owner of the auto bearing No.AP-04-TU-6088, R/o D.No.9/70, Papireddypalli (Vi & Po), Obulavaripalli (Mon), Kadapa Dist.

...Respondent No.3

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా, వాదికి, పై ప్రతివాది యొక్క గూడ్సు ఆటో కలుగజేసిన గాయములకు గాను, వాది పై ప్రతివాదిపైన దాఖలు చేసిన పిటిషను వాయిదా 05.09.2024వ తేదీన వున్నది. కావున పై ప్రతివాది 05.09.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు వకీలు ద్వారా గాని, లేక ఖుద్దున గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

పి.శ్రీకాంత్‌రెడ్డి
అడ్వకేట్, కడప.

విద్యుత్‌శాఖ డిఇకి టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల విద్యుత్‌శాఖలో ఎడిఇగా పనిచేస్తున్న శ్రీకాంత్‌పై వస్తున్న పలు అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆ శాఖ డిఇ శ్రీనివాసులును శుక్రవారం పులివెందుల పట్టణ టిడిపి మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామరెడ్డి, నాయకులు కోరారు. ఆ మేరకు వారు డిఇ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేవారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగాధర్‌రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఎస్ఐ

- టిడిపి యువ నాయకుడు భూమిరెడ్డి సాయి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో విధులు నిర్వహించిన ఎస్ఐ అనిల్‌కుమార్ టిడిపి కార్యకర్తలను, నాయకులను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని టిడిపి యువ నాయకుడు భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ వచ్చే గ్రామం కాంబల్లి పంచాయతీ. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసిపి నాయకుల మాటలకు మడుగులు ఒత్తుతూ సింహాద్రిపురం ఎస్ఐగా అనిల్‌కుమార్ ఓటు వేయడానికి నా సొంత గ్రామానికి వెళ్లిన నన్ను, నా కుటుంబ సభ్యులను ఎంతగానో అవమానించారని ఆరోపించారు. వైసిపి వాళ్ల మాటలు వింటూ తెలుగుదేశం వారిని ఇబ్బంది పెట్టిన విషయం మండల వాసులందరికీ గుర్తుందన్నారు. మండలవ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఎస్ఐని మళ్లీ మన నెత్తిన పెట్టుకుంటున్నాం.. ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఎస్ఐ అనిల్‌కుమార్ విషయంలో సీఎం వరకు వెళతామన్నారు.

సిఐ సురేష్‌రెడ్డిని సన్మానించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన సిఐ సురేష్‌రెడ్డిని టిడిపి నేతలు సన్మానించారు. శుక్రవారం సిఐని మాజీ దేవస్థానం ఛైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి పివి రమణ, మాజీ వార్డు మెంబరు రామకృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సిఐని కోరారు. పాఠశాల వద్ద కూడ గస్తీ పెంచి నిఘా పెట్టాలని కోరారు. రాజకీయ నాయకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారంతో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని సిఐ టిడిపి నేతలకు హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భవనాల్లో పోస్టాఫీసు, రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వం భవనాల్లో పోస్టాఫీసు, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి నేత ఎద్దుల శేషారెడ్డి కోరారు. టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి వేంపల్లెలోని సబ్ రిజిస్టర్, పోస్టాఫీసు కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ఆయా శాఖల అధికారులకు విన్నవించారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక పోస్టాఫీసును తనిఖీ చేసేందుకు విచ్చేసిన తపాలాశాఖ ఎస్ఇ అభిషేక్‌ను, వేంపల్లె సబ్ రిజిస్టర్ అధికారి హరికృష్ణను టిడిపి నేతలు కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో టిడిపి నేతలు భాస్కర్, గొటూరు నాగభూషణం పాల్గొన్నారు.

మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

సెమిస్టర్ ఫలితాలో సత్తా చాటిన వేదవ్యాస విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యోగి వేమన యూనివర్సిటి డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి విద్యార్థులు యూనివర్సిటి స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి తెలిపారు. రెండవ సెమిస్టర్ బియస్సీ విభాగంలో వి.మన్విత రెడ్డి 9.75, జి గౌస్‌బి 9.17, సాజిదా రెహమాని 9.08. బి.కామ్ (కంప్యూటర్)విభాగంలో జి.మౌనిక 9.00, ఎస్.అర్షియా 8.92, పి.భారతి 8.75, నాల్గవ సెమిస్టర్ ఎం.పి.సిఎస్ విభాగంలో ఎ.నాగ సుష్మిత 9.23, ఎస్.చాంద్‌బి 8.87, ఎంఎస్సిఎస్ విభాగంలో కె.అనూష 8.53, జె ఆయేషా 8.28, బి.కామ్(కంప్యూటర్) విభాగంలో ఎస్.అతిఫాభాను 9.10, కె.పూజిత 9.02తో మంచి ఫలితాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శనరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కొండాపురం ఎస్ఐగా విద్యాసాగర్

కొండాపురం : కొండాపురం ఎస్ఐగా విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన పనిచేశారు. బి.మఠం నుంచి కొండాపురం బదిలీ అయ్యారు. తన పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అహర్నిశలు పాటుపడతానని తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ముద్దనూరు : ఉమ్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన వంగల అంజలి (29) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సిఐ దస్తగిరి తెలిపిన వివరాల ప్రకారం.. సింహాద్రిపురం మండలం నక్కలపల్లె చెందిన అంజలికి ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన నరసింహారెడ్డితో నాలుగేళ్ల క్రితం వివాహ మైంది. నరసిం హారెడ్డి ఆర్టిపిపిలో జెపిఏగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం నరసింహారెడ్డి అక్క నాగేశ్వరి తన ఇంటికి వచ్చింది. నరసింహారెడ్డి తన అక్కతో మాట్లా డినం దుకు అంజలి మన స్థాపా నికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ తెలిపారు. మృతు రాలికి 15 నెలల బాలుడు ఉన్నాడు. అంజలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, AT GUNTUR
M.A.No:-5/2024 in CC.N.No:-128/2024
IA.No:-207/2024 in C.C.No:-128/2024

Between: -
1.Ancha Kamala, Rep.by her Authorized GPA holder Ancha Mohan Rao
2.Ancha Tejaswani, Rep. by her Authorised GPA holder cum Father Ancha Mohan Rao ....Petitioners/Complainants

AND

1.M/s Mahadev Infratech Construction, Rep. by its managing partner Devineni Srikanth,
2.M/s Mahadev Infratech Construction, Rep. by its managing partner Araveeti Syam Kumar Reddy.
....Respondents/Opposite Parties

To,
R2: - M/s Mahadev Infratech Construction, Rep. by its managing partner Araveeti Syam Kumar Reddy. S/o Eswar Reddy, D.No: - 3-189, Aaraveedu village, Galiveedu Mandal, Kadapa dist 516267.

పై నెంబరు C.C గల మరియు M.A లలోని పిటీషనులో ఆపోజిట్‌పార్టీ/రెస్పాండెంటు అయిన మీకు గౌరవ కమీషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీకు ముట్టనందున గౌరవ కమీషన్ వారు మీకు నోటీసును SUBSTITUTED SERVICE ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా సదరు ఆర్డరు ప్రకారం మీరు ది. 03-09-2024 న ఉ.గం.10-30 ని॥లకు పైన తెలిపిన శ్రీయుత కమీషన్ వారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడునని తెలిమపర్చడమైనది.

(శ్రీయుత కమీషన్ వారి అనుమతితో)

వాయిదా తేది:03-09-2024

Kolluru Giridhar,
Advocate for Petitioner/Complainant,
Guntur.